నేటి నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

- తొలి రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం
- 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్
- వక్ఫ్ సహా 16 బిల్లులను ప్రవేశపెట్టనున్న నరేంద్ర మోదీ సర్కార్

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉభయసభల్లో ఆర్థిక సర్వేను, శనివారం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. మహాకుంభమేళాలో తొక్కిసలాట అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తాలని విపక్షాలు నిర్ణయించాయి. అయితే, ఏయే అంశాలపై చర్చించాలనేది బీఏసీ సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. కాగా, జనవరి 31 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండు విడతల్లో బడ్జెట్ సమావేశాలు జరుగుతాయి. మొదటి విడత సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. ఈ సమావేశాల్లో 16 బిల్లులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. వక్ఫ్(సవరణ) బిల్లు, బ్యాంకింగ్ చట్టాల(సవరణ) బిల్లు, రైల్వే(సవరణ) బిల్లు, విపత్తు నిర్వహణ(సవరణ) బిల్లుతో పాటు వలస, విదేశీయుల బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. ఈ నేపథ్యంలో గురువారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. పార్లమెంటరీ కమిటీల్లో మెజార్టీని ఉపయోగించి అజెండాను కేంద్రం బలవంతంగా రుద్దుతున్నదని విపక్షాలు ఆరోపించాయి.

నోటీసులతో సీఈసీ రాజకీయం

- ఈసీ విశ్వసనీయతను ఆయన నాశనం చేశారు
- యమున వివాదం నేపథ్యంలో ఆప్ అధినేత కేజ్రీవాల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: తనకు నోటీసులు పంపడం ద్వారా ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం విశ్వసనీయతను రాజీవ్ కుమార్ నాశనం చేశారని, తాను రిటైరయిన తర్వాత లభించబోయే పదవిపైనే ఆయన దృష్టి ఉందని ఆరోపించారు. ఆయన చేసినంతగా ఎవరూ ఈసీకి ఇంత నష్టం కలిగించ లేదని అన్నారు. ఆయన రాజకీయాల్లోకి రావాలనుకుంటే నేరుగా వచ్చి ఢిల్లీ ఎన్నికల్లో పోటీ చేయవచ్చునన్నారు. తాను బతికున్నంత వరకు విషతుల్యమైన నీటిని ఢిల్లీ వాసులు తాగేందుకు ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించనని చెప్పారు. వారు తనను రెండు మూడు రోజుల్లో అరెస్ట్ చేస్తారన్న విషయం తెలుసని, అయినా తాను భయపడనని కేజ్రీవాల్ స్పష్టం చేశారు.యమున నదిలో హర్యానా విషం కలుపుతున్నదని కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలతో వివాదం రేగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇందులో ఎలాంటి విషాలు లేవని నిరూపించేందుకు బుధవారం హర్యానా సీఎం నాయబ్‌సింగ్ సైనీ యమున నీటిని తాగారు. కాగా, యమున వివాదాన్ని రెండు దేశాల మధ్య యుద్ధంగా చూడొద్దని కేజ్రీవాల్‌కు ఈసీ సూచించింది.

పంజాబ్ సీఎం ఇంట్లో ఈసీ సోదాలు

పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఇంట్లో ఎన్నికల సంఘం గురువారం సోదాలు నిర్వహించింది. ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెడుతున్నారని వచ్చిన ఆరోపణల మేరకు ఈసీకి చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ కపుర్తలాలోని ఆయన ఇంట్లో సోదాలు జరిపింది. ఈ విషయాన్ని ఆయన ట్వీట్ చేశారు.

రెండేండ్ల కాలానికే హెచ్-1బీ వీసా!

- అమెరికా చట్టసభ్యుల ముందుకు హౌజ్ కమిటీ ప్రతిపాదన
- దేశ వలస విధానంలో సంస్కరణల దిశగా కీలక అడుగులు
- అక్రమ వలసదారుల కోసం మరో నిర్బంధ కేంద్రం ఏర్పాటు
- గడువు తీరినా యూఎస్‌లోనే 7 వేల మంది భారతీయులు

వాషింగ్టన్, జనవరి 30: అమెరికా ఇమ్మిగ్రేషన్ విధానంలో కీలక సంస్కరణల దిశగా అడుగులు పడుతున్నాయి. 'అమెరికాలో ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పునరుద్ధరణ' అంశంపై విచారణ చేపట్టిన యూఎస్ హౌజ్ కమిటీకి సెంటర్ ఆఫ్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్‌కు చెందిన జెస్సికా ఎం వాఘన్ కీలక సంస్కరణలను ప్రతిపాదించారు. ప్రస్తుతం ఇతర దేశాలకు చెందిన నిపుణులు అమెరికా కంపెనీల్లో పని చేసేందుకు మూడేండ్ల కాలపరిమితితో ఇస్తున్న హెచ్-1బీ వీసాలను రెండేండ్లకే ఇవ్వాలని, అవసరమైతే నాలుగేండ్ల కాలానికి మాత్రమే పొడిగించే అవకాశం కల్పించాలని ఆమె సూచించారు. గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారనే కారణంతో ఆటోమేటిక్‌గా హెచ్-1బీ వీసాను పొడిగించే విధానాన్ని తొలగించాలని ప్రతిపాదించారు. హెచ్-1బీ వీసాల సంఖ్యను సైతం 75 వేలకే పరిమితం చేయాలని సూచించారు. విద్యార్థి వీసాలపై(ఎఫ్-1, ఎం-1) అమెరికాకు వచ్చే విదేశీ విద్యార్థుల నుంచి చదువు పూర్తయిన తర్వాత తిరిగి సొంత దేశాలకు వెళ్తామనే సమ్మతిని తీసుకోవాలని ప్రతిపాదించారు. విదేశీయులకు వర్క్ వీసాలు ఇవ్వడం వల్ల అమెరికన్లు నిరుద్యోగులుగా మారుతున్నారని, స్టాఫింగ్ కంపెనీలు విదేశీయులకు వర్క్ వీసాలు స్పాన్సర్ చేయడానికి అనుమతించొద్దని సూచించారు.

గడువు ముగిసినా అమెరికాలోనే..

విద్యార్థి, ఎక్స్ఛేంజ్ వీసాలపై అమెరికాకు వస్తున్న చాలా మంది వీసాల గడువు ముగిసినా అమెరికాలోనే ఉంటున్నారని జెస్సికా ఎం వాఘన్ తెలిపారు. 2023లోనే వీసా గడువు ముగిసినా అమెరికాలో అక్రమంగా ఉంటున్న వారిలో భారతీయులే 7 వేల మంది ఉన్నారని, ఆ తర్వాత బ్రెజిల్, చైనా, కొలంబియా దేశస్థులు 2 వేల మంది కంటే ఎక్కువే ఉన్నారని నివేదించారు.

జన్మతః పౌరసత్వం రద్దుకు బిల్లు

అక్రమ, తాత్కాలిక వీసాలపై అమెరికాలో నివసిస్తున్న వలసదారులకు జన్మించే పిల్లలకు జన్మతః పౌరసత్వం ఇవ్వకుండా నియంత్రించే బిల్లు యూఎస్ సెనేట్ ముందుకు వచ్చింది. అధికార రిపబ్లికన్ పార్టీ సెనేటర్ల బృందం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఎలాంటి ఆంక్షలు లేకుండా జన్మతః పౌరసత్వం ఇస్తున్న 33 దేశాల్లో అమెరికా ఒకటని ఈ బృందం పేర్కొన్నది. కాగా, ఇటీవలే జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యనిర్వాహక ఆదేశాన్ని జారీ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం దీనిపై కోర్టు స్టే విధించింది. మరోవైపు నేరచరిత్ర ఉన్న అక్రమ వలసదారులను విచారణకు ముందే నిర్బంధించేందుకు చేసిన లాకెన్ రిలే చట్టంపై ట్రంప్ బుధవారం సంతకం చేశారు. వీరిని నిర్బంధించేందుకు గ్వాంటనామో బేలో 30 వేల మంది పట్టేలా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు.

విమానం - హెలికాప్టర్ ఢీ

67 మంది దుర్మరణం

- అమెరికాలో ఘోర విమాన ప్రమాదం
- మృతుల్లో ఫిగర్ స్కేటింగ్ క్రీడాకారులు
- వైట్‌హౌజ్‌కు అతి సమీపంలో దుర్ఘటన

అర్లింగ్టన్, జనవరి 30: అమెరికాలో ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకున్నది. వాషింగ్టన్‌లోని రొనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఓ ప్రయాణికుల విమానం, ఆర్మీ హెలికాప్టర్ ఢీకొన్నాయి. బుధవారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనలో 67 మంది ప్రయాణికుల ఆచూకీ గల్లంతయ్యింది. కాన్సాస్‌లోని విచిత నుంచి బయలుదేరిన అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ప్రాంతీయ విమానం రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టులోని రన్‌వే 33పై ల్యాండ్ అవ్వాల్సి ఉండగా ఈ ప్రమాదం జరిగింది. రన్‌వేకు అతి సమీపంలో, పోటోమాక్ నదిపైన ఎదురుగా ఆర్మీ శిక్షణ హెలికాప్టర్ రావడంతో రెండూ ఢీకొన్నాయి. ప్రమాదంలో విమానం, హెలికాప్టర్ ముక్కలయ్యి పోటోమాక్ నదిలో కూలిపోయాయి. హెలికాప్టర్ సైతం తలకిందులుగా నేలకూలింది. ప్రమాద సమయంలో విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. హెలికాప్టర్‌లో ముగ్గురు సిబ్బంది ఉన్నట్టు సైన్యం ధ్రువీకరించింది. వీరందరూ మృతి చెంది ఉంటారని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటివరకు 27 మంది మృతదేహాలను వెలికితీసినట్టు తెలుస్తున్నది. మృతుల్లో అమెరికా, రష్యాకు చెందిన ఫిగర్ స్కేటింగ్ క్రీడాకారులు ఉన్నారు. కాగా, అమెరికాలో గత 24 ఏండ్లలో ఎక్కువ మంది మరణాలకు కారణమైన విమాన ప్రమాదం ఇదేనని అధికారులు భావిస్తున్నారు.

వైట్‌హౌజ్‌కు మూడు మైళ్ల దూరంలో..

వాషింగ్టన్‌లోని వైట్‌హౌజ్, క్యాపిటల్ భవనానికి కేవలం మూడు మైళ్ల దూరంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నది. ప్రపంచంలో అత్యంత నియంత్రణ కలిగిన గగనతలంలో ఈ ప్రమాదం జరగడం గమనార్హం. రన్‌వేకు 2,400 అడుగుల దూరంలో, భూమికి 400 అడుగుల ఎత్తులో, గంటకు 140 మైళ్ల వేగంతో ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదం జరిగినట్టు విమానంలోని రేడియో ట్రాన్స్‌పాండర్ డాటాను బట్టి తెలుస్తున్నది. 'మీకు ఎదురుగా విమానం కనిపిస్తున్నదా?' అని హెలికాప్టర్ పైలట్‌ను ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు అడుగుతుండగానే ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ దుర్ఘటనతో అమెరికా దుఃఖంలో మునిగిపోయిందని అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ఎయిర్ కంట్రోలర్ల ఎంపికలో మాజీ అధ్యక్షులు ఒబామా, బైడెన్ అవలంభించిన విధానాల వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు.

తాత్కాలిక జడ్జీల నియామకానికి సుప్రీం ఓకే

గత తీర్పు సవరణ

న్యూఢిల్లీ: దేశంలోని వివిధ న్యాయస్థానాలలో 18 లక్షలకు పైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్న క్రమంలో వాటి పరిష్కారానికి అడ్‌హక్ జడ్జీలను నియమించుకునేందుకు హైకోర్టులకు అనుమతి ఇస్తూ సుప్రీం కోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. అయితే మొత్తం న్యాయమూర్తులలో వీరి సంఖ్య 10 శాతానికి మించి ఉండరాదని పేర్కొంది. హైకోర్టులలో తాత్కాలిక న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి 2021, ఏప్రిల్ 20న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులోని కొన్ని నిబంధనలను నిలిపివేస్తూ, మరికొన్నింటిని మినహాయిస్తూ చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. గత తీర్పు ప్రకారం.. హైకోర్టులలో మొత్తం జడ్జీల సంఖ్యలో 80 శాతం మంది అప్పటికే ఉంటే తాత్కాలిక జడ్జీలను నియమించ రాదని పేర్కొన్నారు.

వరకట్న చట్టంలో మార్పులు చేయండి

సూసైడ్ నోట్ రాసి యువకుడి ఆత్మహత్య

ఇండోర్, జనవరి 30: భార్య వేధింపులు తాళలేక ఒక యువ ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య చేసుకున్నాడు. వరకట్న నిరోధక చట్టంలో మార్పులు చేయాలని, మహిళలు దానిని దుర్వినియోగం చేయకుండా నిరోధించాలని తన సూసైడ్ నోట్‌లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ పోలీసులు అతని భార్య, తల్లి, ఆమె ఇద్దరు కుమార్తెలపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఫొటోగ్రాఫర్‌గా పనిచేసే నితన్ పడియార్(28)పై అతని భార్య రాజస్థాన్‌లో వరకట్న వేధింపుల కేసు నమోదు చేయడంతో 20న ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలాంటి తప్పుడు కేసుల ద్వారా తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని, యువకులు పెండ్లి చేసుకోవద్దని సూసైడ్ నోట్‌లో కోరాడు.

మనుషులు పారిశుద్ధ్య పనులు చేయడంపై నిషేధం

- హైదరాబాద్ సహా ఆరు మెట్రో నగరాలకు వర్తింపు
- సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ : పారిశుద్ధ్య కార్యక్రమాల్లో, మురుగునీటి కాలువలను శుభ్రపరచడంలో మానవులను వినియోగించడంపై సుప్రీంకోర్టు ఈ నెల 29న నిషేధం విధించింది. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు మెట్రో నగరాలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని తెలిపింది. బలరామ్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ ఆదేశాలను ఇచ్చింది. ఈ పనుల కోసం మానవులను వినియోగించడాన్ని నిలిపేయడానికి చేపడుతున్న చర్యలను ఫిబ్రవరి 13లోగా తెలియజేయాలని సుప్రీం ఆదేశించింది.

త్వరలో ఇండియా మాడల్ 'ఏఐ'

కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్

భువనేశ్వర్: సొంత కృత్రిమ మేధ(ఏఐ) మాడల్ అభివృద్ధికి భారత్ చేరువలో ఉన్నట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. భువనేశ్వర్‌లో 'ఉత్కర్ష్ ఒడిశా' సమావేశంలో బుధవారం ఆయన ప్రసంగించారు. ఏఐ మాడల్ అభివృద్ధి కోసం ఆరు సంస్థలు ప్రధానంగా పని చేస్తున్నాయని మరో 4 నుంచి 10 నెలల్లో చాట్‌జీపీటీ, డీప్‌సీక్ లాంటి ఏఐ మాడల్ అభివృద్ధి అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఏఐ మాడల్ అభివృద్ధి కోసం గత ఏడాదిన్నరగా అంకుర సంస్థలు, పరిశోధకులు, తమ బృందాలు పని చేస్తున్నాయని అన్నారు.

నోబెల్ శాంతి బహుమతికి మస్క్ నామినేట్

వాషింగ్టన్: అమెరికన్ బిలియనీర్ ఎలాన్ మస్క్ ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారానికి నామినేట్ అయ్యారు. వాక్ స్వాతంత్ర్యం, మానవ హక్కుల రక్షణ కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆయన పేరు నామినేట్ అయ్యిందని యూరోపియన్ పార్లమెంట్ సభ్యుడు బ్రాంకో గ్రిమ్స్ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో వెల్లడించారు. ఎలాన్ మస్క్ పేరును నామినేట్ చేస్తూ నార్వే నోబెల్ కమిటీ ముందు పిటిషన్ దాఖలైనట్టు గ్రిమ్స్ తెలిపారు. టెస్లా, స్పేస్-ఎక్స్ సంస్థలకు సీఈవోగా ఉన్న ఎలాన్ మస్క్‌ను ట్రంప్ సర్కార్ 'డోజ్' హెడ్‌గా నియమించింది.

ఊసరవెల్లి అద్దాలు!

చెన్నై: రంగులు మార్చే అద్దాలు ఉంటే బాగుంటుందని మీకు అన్పించిందా? మీ ఊహను నిజం చేస్తున్నారు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడు(సీయూటీఎన్) పరిశోధకులు. మెటీరియల్ సైన్స్ విభాగ సహ ఆచార్యుడు శ్రీనివాసన్ సంపత్, పరిశోధక విద్యార్థిని పీవీ నవ్య కృషితో రంగులు మారే సరికొత్త అద్దాలను కనుగొన్నారు. ఆర్కిటెక్చర్, ఆటోమొబైల్ రంగాల్లో ఈ రంగు మార్చే అద్దాలు విస్తృతంగా వాడవచ్చు. ఈ అద్దాలకు విద్యుత్తును అనుసంధానిస్తే నారింజ, పసుపు, పచ్చ, నీలం, ఊదా తదితర రంగుల్లోకి మారతాయి. మనకు కావల్సిన రంగుల్లోకి ఈ అద్దాలను మార్చుకోవచ్చు. అతి నీలలోహిత, పరారుణ కిరణాల నుంచి కూడా ఈ అద్దాలు రక్షణ కల్పిస్తాయి. దీనిపై నేరుగా కాంతి పడినా, ఎదురుగా ఉన్న వస్తువులను చూడవచ్చు. వీటికి కొంత ఎక్కువే ఖర్చవుతుందని పరిశోధకులు తెలిపారు.

సునీతా విలియమ్స్ 'స్పేస్‌వాక్'

వాషింగ్టన్, జనవరి 30: నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్‌మోర్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) నుంచి బయటకు వచ్చి స్పేస్‌వాక్ చేశారు. ఐఎస్ఎస్‌కు సంబంధించిన నిర్వహణ పనులు, శాస్త్రీయ పరిశోధనల కోసం అవసరమైన నమూనాల సేకరణ కోసం వీరు ఐఎస్ఎస్ నుంచి బయటకు వెళ్లారు. ఐఎస్ఎస్‌తో భూమికి ఉండే సమాచార వ్యవస్థను ఆధునీకరించేందుకు వీలుగా ఇప్పటికే ఉన్న రేడియో ఫ్రీక్వెన్స్ యాంటెన్నాను వీరు తొలగించారు. అంతరిక్ష కేంద్రానికి బయటి వైపు సూక్ష్మజీవులు మనగలుగుతున్నాయా అనేది తెలుసుకునేందుకు ఉపయోగపడే నమూనాలను సేకరించారు. కాగా, వారం రోజుల అంతరిక్ష యాత్ర కోసం గత ఏడాది జూన్‌లో బోయింగ్ స్టార్‌లైనర్ ద్వారా సునీతా విలియమ్స్, విల్‌మోర్ ఐఎస్ఎస్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే.

'ముడా'లో మనీ లాండరింగ్!

- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ప్రధాన నిందితుడిగా చేర్చిన ఈడీ
- సీఎం భార్య పార్వతి, అధికారులను కూడా
- భూవిక్రయాల్లో మనీలాండరింగ్ ప్రయత్నాలు జరిగాయన్న ఈడీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): కర్ణాటక రాజకీయాలను కుదిపేస్తున్న ముడా స్కామ్‌లో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. ముడా కుంభకోణంలో అక్రమాలు జరిగాయని ఇదివరకే ప్రకటించిన ఈడీ తాజాగా మనీలాండరింగ్ ప్రయత్నాలు కూడా జరిగినట్టు వెల్లడించింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా సీఎం సిద్ధరామయ్య, ఆయన సతీమణి బీఎం పార్వతితో పాటు మరికొందరు కుటుంబసభ్యులు, అలాగే ముడాలో పనిచేసిన అప్పటి కీలక అధికారుల పేర్లను కూడా చేర్చింది. ఈ మేరకు గురువారం ప్రొవిజనల్ అటాచ్‌మెంట్ ఆర్డర్ (పీఏవో)లో వెల్లడించింది.

ఈడీ నివేదికలో ఏమున్నదంటే?

ఈడీ పీఏవో నివేదిక ప్రకారం.. సిద్ధరామయ్య భార్యకి కట్టబెట్టిన 14 సైట్లలో నిబంధనల ఉల్లంఘన జరిగింది. ఖరీదైన స్థలాలను కాజేయడంలో భాగంగా మనీ లాండరింగ్ ప్రయత్నాలు జరిగాయి. భూములను కాజేయడానికి సాక్ష్యాలు, ఆధారాలను తారుమారు చేశారు. సంతకాలను ఫోర్జరీ చేశారు. ప్రజావసరాల కోసం అప్పటికే సేకరించిన భూమిని నోటిఫికేషన్ రద్దు పేరిట దారిమళ్లించారు. సిద్ధరామయ్య కుటుంబసభ్యులకు లబ్ధి చేయడానికే ఇదంతా చేసినట్టు తమ విచారణలో తేలిందని ఈడీ తెలిపింది.

లక్ష కోట్ల బిల్లులు పెండింగ్

- చెల్లించకుంటే ఫిబ్రవరి 5 నుంచి సమ్మెకు దిగుతాం
- మహారాష్ట్ర మహాయుతి సర్కారుకు కాంట్రాక్టర్ల అల్టిమేటం

ముంబై: భారీగా అప్పులుచేశారని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తరచూ విమర్శలు చేసే బీజేపీ.. ఆ పార్టీ అధికారంలో ఉన్న మహారాష్ట్రలో మాత్రం రాష్ట్ర ఆర్థికాన్ని భ్రష్టుపట్టించింది. కాంట్రాక్టర్లకు సుమారు లక్ష కోట్ల మేర బిల్లులను చెల్లించలేదు. దీంతో వారు నిరసనలకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులను చెల్లించకుంటే ఫిబ్రవరి 5 నుంచి సమ్మెకు దిగుతామని మహారాష్ట్ర రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం(ఎంఎస్‌సీఏ) హెచ్చరించింది. ప్రజా పనుల విభాగం నుంచి అత్యధికంగా రూ.46 వేల కోట్లు కాంట్రాక్టర్లకు రావాల్సి ఉందని ఎంఎస్‌సీఏ అధ్యక్షుడు మిలింద్ భోసలే తెలిపారు. గత 8 నెలలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో మౌలిక, అభివృద్ధి రంగాల్లోని సుమారు 4 లక్షల కాంట్రాక్టర్లు, 4 కోట్ల కార్మికులు ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'మా సమస్యలను పట్టించుకోకుండా, ప్రచారం కోసం ప్రభుత్వం ఉచితాల పంపిణీ పైన దృష్టి సారించింది' అని ఆయన ఆరోపించారు. చాలామంది చిన్న కాంట్రాక్టర్లు, నిరుద్యోగ యువత అభివృద్ధి ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టారని.. కానీ బిల్లుల మంజూరులో ఆలస్యం వారి మానసిక ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని ఆయన తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా బిల్లుల చెల్లింపు ఆలస్యమైందని రాష్ట్ర పట్టణ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి యోగేశ్ కదమ్ వివరణ ఇచ్చారు.

తరగతి గదిలో విద్యార్థితో మహిళా ప్రొఫెసర్ పెండ్లి

వైరల్‌గా మారిన వీడియో.. నిజం కాదన్న ప్రొఫెసర్

కోల్‌కతా, జనవరి 30: పశ్చిమ బెంగాల్‌లో తరగతి గదిలో అందరి సమక్షంలో ఒక మహిళా ప్రొఫెసర్ తన విద్యార్థిని వివాహం చేసుకుంటున్న దృశ్యం సంచలనం సృష్టించింది. దండలు మార్చుకోవడం, ఏడడుగులు నడవడం వంటివి సైతం ఆ వీడియోలో ఉండటంతో యూనివర్సిటీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ ఘటన కోల్‌కతాకు 150 కిలోమీటర్ల దూరంలోని నడియా లోని హరింఘట టెక్నాలజీ కాలేజీలో చోటు చేసుకున్నట్టు అధికారులు గుర్తించారు. పెండ్లికూతురు వేషధారణలో మెడలో దండలతో ఉన్న మహిళను ప్రొఫెసర్ పాయల్ బెనర్జీగా గుర్తించారు. అయితే ఇది నిజమైన వివాహం కాదని, పాఠ్యాంశ బోధనలో ఇంటర్నల్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించినదని ఆమె స్పష్టం చేశారు. దీంతో ప్రొఫెసర్‌ను కాలేజీ యాజమాన్యం తాత్కాలికంగా సెలవుపై పంపించి, విచారణ జరుపుతున్నది.

రేప్ కేసులో కాంగ్రెస్ ఎంపీ అరెస్ట్

న్యూఢిల్లీ: యూపీలోని సీతాపూర్ కాంగ్రెస్ ఎంపీ రాకేశ్ రాథోడ్‌ను ఓ రేప్ కేసులో గురువారం అరెస్ట్ చేసినట్టు అధికారులు తెలిపారు. యూపీ కాంగ్రెస్ యూనిట్ జనరల్ సెక్రటరీ అయిన రాథోడ్ పత్రికా సమావేశం నిర్వహిస్తుండగా ఆయనను అదుపులోకి తీసుకున్నారు. రాథోడ్ తనను నాలుగేండ్లుగా లైంగికంగా వేధిస్తున్నారని ఓ మహిళ ఈ నెల 17న ఫిర్యాదు చేసింది. తనను పెండ్లి చేసుకొంటానని, రాజకీయాల్లో మంచి కెరీర్ కల్పిస్తానని చెప్పి రాథోడ్ తనను మోసగించారని ఆమె ఆరోపించారు.

లిప్‌స్టిక్స్‌తో ఆరోగ్యానికి ముప్పు!

వాటిల్లో అధిక స్థాయిల్లో మెర్క్యురీ.. వెల్లడించిన కేరళ ఆరోగ్య మంత్రి

తిరువనంతపురం, జనవరి 30: లిప్‌స్టిక్స్, ఇతర కాస్మటిక్ ఉత్పత్తులతో ఆరోగ్యానికి ముప్పు ఉందని కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ హెచ్చరించారు. కాస్మటిక్స్‌పై ఆమె తాజాగా తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. కాస్మటిక్ ఉత్పత్తుల్లో అధిక మోతాదుల్లో మెర్క్యురీ, ఇతర ప్రమాదకర రసాయనాలు ఉంటున్నట్టు ఆమె చెప్పారు. ఇది ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. కాస్మటిక్స్ కొనేముందు వినియోగదారులు ఆ ఉత్పత్తుల గురించి, తయారుదారు గురించి తెలుసుకోవాలని, లైసెన్స్‌డ్ కంపెనీలే విక్రయిస్తున్నాయా అనేది చూసుకోవాలని ఆమె సూచించారు. కాగా, మెర్క్యురీ అధికంగా ఉన్న ఉత్పత్తులు వాడటం వల్ల చర్మం రంగు మారడం, దద్దుర్లు కావడం, ఉదర, నాడీ సమస్యలు రావడంతో పాటు రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

క్యాన్సర్‌కు సరికొత్త చికిత్స

కణాలు తమనుతాము నాశనం చేసుకునేలా కొత్త విధానం

ఢిల్లీ, జనవరి 30: క్యాన్సర్ చికిత్సకు పరిశోధకులు సరికొత్త పద్ధతిని అభివృద్ధి చేశారు. జన్యుమార్పిడి ద్వారా క్యాన్సర్ కణాలు తమనుతాము చేసుకునేలా ప్రేరేపించి క్యాన్సర్‌ను నయం చేయవచ్చని పరిశోధకులు గుర్తించారు. ఈ మేరకు 'నేచర్ బయోటెక్నాలజీ'లో కథనం ప్రచురితమైంది. సాధారణంగా ఔషధాల నుంచి తప్పించుకునేందుకు క్యాన్సర్ కణాలు రోగనిరోధక వ్యవస్థను తరచూ అభివృద్ధి చేస్తుంటాయి. సరికొత్త మార్గాలను అన్వేషిస్తూ చికిత్స నుంచి తప్పించుకుంటాయి. దీనివల్ల క్యాన్సర్ చికిత్సలో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఈ కారణంగానే క్యాన్సర్ చికిత్సలో కాంబినేషన్ థెరపీలు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో 'టూ స్విచ్చెస్' విధానాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ అధ్యయనంలో భాగంగా మొదటి విడతలో జన్యుమార్పిడి చేసిన కణాలపై ఒక ప్రత్యేక ఔషధాన్ని ప్రయోగించగా.. అది జన్యుమార్పిడి కణాల సంఖ్యను రెట్టింపు చేయడంతో పాటు క్యాన్సర్ కణితిని స్వాధీనం చేసుకుంటుంది. ఆ తర్వాత రెండో విడతలో జన్యుమార్పిడి కణాలు విడుదల చేసే రసాయనం వల్ల క్యాన్సర్ కణాలు నశించిపోయాయి. ఈ విధానంలో 20 రోజుల్లో క్యాన్సర్ కణాలను జన్యుమార్పిడి కణాలు అధిగమించాయి. రెండో జన్యువు యాక్టివేట్ చేశాక 80 రోజులకు క్యాన్సర్ కణితి పూర్తిగా నశించినట్టు పరిశోధకులు గుర్తించారు.

మోనాలిసాకు బాలీవుడ్ చాన్స్

భోపాల్: మహా కుంభ మేళాలో వైరల్ అయిన మోనాలిసా భోస్లే *(16)* బాలీవుడ్ చాన్స్ దక్కించుకుంది. హిందీ సినిమా 'ది డైరీ ఆఫ్ మణిపూర్'తో ఆమె తెరంగేట్రం చేయనుంది. రచయిత, దర్శకుడు సనోజ్ మిశ్రా ఇన్‌స్టాగ్